

ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు బాధ్యతల స్వీకరణ


నాగరాజును అభినందిస్తున్న ఎంపీ అంబికా

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు శుక్రవారం అనంతపురం ఆర్టీసీ ప్రాంగణంలోని జోనల్ ఛైర్మన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పూల నాగరాజు ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పెద్దఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కడప జోన్) చంద్ర శేఖర్, రీజినల్ మేనేజర్ సుమంత్, ఆర్.ఆదోని, పుట్టపర్తి డిపిటిఒ మధుసూదన్, మాజీ జడ్పీటీసీలు రామలింగారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకగా స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథిగా యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సేతు రామన్ పంచనాథన్
- 22 మందికి బంగారు పతకాలు
- 14 మందికి డాక్టరేట్


విద్యార్థినికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న ఛాన్సర్ చక్రవర్తి


స్నాతకోత్సవం లో మాట్లాడుతున్న సేతురామన్ పంచనాథన్.

శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ 43వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం నాడు వేడుకగా జరిగాయి. ముఖ్యఅతిథిగా యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సేతు రామన్ పంచనాథన్ హాజరయ్యారు. స్నాతకోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సత్యసాయిబాబా జయంతికి ఒక రోజు ముందు స్నాతకోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నాతకోత్సవానికి ముందు హైయర్ లర్నింగ్ విద్యార్థులు ట్రస్ట్ సభ్యులు, అధ్యాపక బందాన్ని ప్రత్యేక కవాతు ద్వారా వేదిక వద్దకు వద్దకు తీసుకుని వచ్చారు. ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం విద్యార్థులకు బంగారు పథకాలు, డాక్టరేట్లను ప్రదానం చేశారు.

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్


పరిశోధనలు.. సేవతో ప్రపంచ గుర్తింపు

శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు, సేవా కార్యక్రమాలు ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చి పెడుతున్నాయనియూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సేతురామన్ పంచనాథన్ పేర్కొన్నారు. 43వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సత్యసాయి విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ప్రపంచస్థాయి గుర్తింపుని తెచ్చిపెడుతున్నా యన్నారు. అదే స్థాయిలో విద్యార్థులు చేస్తున్న సేవలు అమోఘం అని కొనియాడారు. సత్యసాయి బాబా మానవతా విలువలతో కూడిన విద్యను అందించేందుకు విద్యాసంస్థలను స్థాపించారన్నారు. ఈ విద్యా సంస్థల ద్వారా ఉత్తమ విలువలను కలిగిన విద్యార్థులను ప్రపంచానికి అందజేస్తున్నారని చెప్పారు. సత్యసాయి బాబా ఆశయాలు, సేవలను కొనసాగిస్తూ విద్య, వైద్య, ఆధ్యాత్మిక విభాగాల ద్వారా ట్రస్ట్ చేపడుతున్న సేవలు అభినందనీయం అన్నారు. సత్యసాయిబాబా ఆశయ సాధన కోసం విద్యార్థులు చేస్తున్న కృషి తదుపరి తరాలకు ఆదర్శనీయం అన్నారు. అనంతరం భగవాన్ సత్యసాయి బాబా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను వీక్షణ పరికరాల ద్వారా వినిపించారు. వైస్ ఛాన్సర్ రాఘవేంద్రప్రసాద్ విశ్వవిద్యాలయం పురోగతిని ప్రదర్శిస్తూ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జె.రత్నాకర్, ట్రస్టీ ఎస్ఎస్.నాగా నంద్, టికెకె.భగవత్, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛాన్సర్, రిజిస్టర్, డీన్, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

22 బంగారు పథకాలు.. 14 పిహెచ్‌డిలు

సత్యసాయి విశ్వవిద్యాలయంలో 463 మంది విద్యార్థులు డిగ్రీల్లో ప్రవేశం పొందారు. వీరిలో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పథకాలను అందజేశారు. స్నాతకోత్సవం సందర్భంగా వీరిలో 22 మందికి బంగారు పథకాలు, 14 మందికి పిహెచ్‌డిలను శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ఛాన్సలర్ చక్రవర్తితో పాటు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్రప్రసాద్ అందజేశారు.

నేడు బాబా జయంతి ఉత్సవాలు | ముఖ్య అతిథిగా గవర్నర్



శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు గురువారం నాడు ప్రశాంతి నిలయంలో వైభవంగా జరగనున్నాయి. వేడుకల నిర్వహణ ఏర్పాట్లను అధికారులు, ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు శుక్రవారం రాత్రే రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పుట్టపర్తికి చేరుకున్నారు. శనివారం సాయికుల్వంత్ హాల్లో బాబా మహాసమాధిని దర్శించుకోనున్నారు. అనంతరం నిర్వహించే బాబా వేడుకల్లో ఈయన పాల్గొని మాట్లాడనున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లోని సభ మండపంలో ప్రశాంతి భజన బందం చేత గురువందనం కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ రథాన్ని ఊరేగింపు జరగనుంది. అనంతరం జోళి మహోత్సవం ఉంటుంది. మల్లాది సోదరుల సంగీత విభావరి కార్యక్రమం జరుగుతుంది. జయంతి వేడుకల సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వీధి దీపాలు, తాగునీరు, విచారణ కేంద్రాలు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నారు. సాయి భక్తుల ఆధ్వర్యంలో పుట్టపర్తి ప్రధాన విధులను పచ్చని తోరణాలతో అలంకరించారు. భవనాలను విద్యుత్ కాంతులతో నింపారు. సత్యసాయి బాబా జయంతి సందర్భంగా స్థానిక భక్తుల సైతం అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్పీ వి.రత్న ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు చర్యలు చేపట్టారు. జయంతి వేడుకలకు దేశ విదేశీ భక్తులు పుట్టపర్తికి చేరుకోవడంతో పుట్టపర్తి పురవీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

అడ్డుగోలు అమిగోస్..!

◆ ప్రతిపక్షంలో ఉండగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ ◆ ఇప్పుడేమో ఆ సంస్థకే మద్దతు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూగర్భ ఖనిజాలకు రాయల్టీ కట్టే కాంట్రాక్టును చేపట్టిన అమిగోస్ సంస్థ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా పాలకులు మౌనంగా ఉండటం అనేక విమర్శలు, ఆరోపణలకు తావిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా ఆ సంస్థపై విచారణ చేపడతామని హెచ్చరించిన వారు... అధికారం వస్తూనే మిన్నకుండిపోయారు. ఇప్పటికీ ఆ సంస్థ రాయల్టీ వసూళ్లలో అడ్డుగోలుగానే వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి రాయల్టీలను వసూలు చేస్తున్న ఆ సంస్థ ఇప్పటికీ ప్రభుత్వానికి మాత్రం డబ్బులు చెల్లించలేదు. అయినా దానిపై అధికారులు మౌనంగా ఉండటం గమనార్హం.

అమిగోస్ కథ ఇది

భూగర్భ ఖనిజాల నుంచి రాయల్టీలను 2023 మార్చి ముందు వరకు భూగర్భ గనుల శాఖ వసూలు చేసేది. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదని, ప్రయివేటుకు కాంట్రాక్టు ఇస్తే ఎక్కువ ఆదాయం సమకూరుతుందని భావించి 2023 మార్చి నుంచి అమిగోస్ సంస్థకు రెండేళ్ల కాల వ్యవధితో కాంట్రాక్టును ఇచ్చారు. నెలకు రూ.11 కోట్లు రాయల్టీ డబ్బులను వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయాలి. సకాలంలో రాయల్టీ డబ్బులను చెల్లించకుంటే 24 శాతం వడ్డీతో చెల్లించాలి. కాని ఆ సంస్థ ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకుండా ఉన్నట్టు ఆరోపణలున్నాయి. సుమారు రూ.150 కోట్లకుపైగా బకాయి ఉంది. అయినా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

అడ్డుగోలుగా డబ్బులు వసూళ్లు

అమిగోస్ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడం లేదుగానీ సామాన్యుల మొదలుకుని క్వారీల వరకు అందరి నుంచి ముక్కుపిండి ఫెనాల్టీలు, రాయల్టీల రూపంలో డబ్బులను ఆ సంస్థ వసూలు చేస్తోంది. గతంలో ఇదే రకంగా వసూలు చేసే క్రమంలోనే అప్పటి వైసిపి అధికారపార్టీ కౌన్సిలర్‌కు సంబంధించిన ఒక ఎక్స్‌వేటర్‌ను దౌర్జన్యంగా తీసుకెళ్లడం విషయం వివాదం కావడంతో సర్దుబాటు చేసుకున్నారు. కంచేచేను మేసిందన్న చందంగా అందులో పనిచేసే ఉద్యోగులు కొందరు వారే మైనింగ్‌లను అనుమతుల్లేకుండా చేపట్టి సొమ్ము చేసుకున్నారు. ఆ సమయంలోనే అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు అమిగోస్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు చేయడమే కాకుండా చర్యలుంటాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సంస్థ హుటాహుటినా కార్యాలయాన్ని తరలించింది. విచారణ చేపడుతున్నట్టు అధికారులు కూడా ప్రకటించారు. కాని తరువాత ఏమైందో అంతా సర్దుకుంది. ఇప్పటికీ అమిగోస్ రాయల్టీ వసూళ్లను యథేచ్ఛగా చేపడుతోంది. దీనికి కారణం పైస్థాయిలో ఆ సంస్థకు అధికారపార్టీ నేతలతో ఒప్పందం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఒప్పందం మేరకు అమిగోస్ కాకుండా మరో సంస్థకు లోపాయికారిగా రాయల్టీ వసూళ్ల బాధ్యతలను అప్పగించినట్టు సమాచారం.

అమిగోస్‌పై చర్యలు తీసుకోవాలి

అమిగోస్ సంస్థ సామాన్యులు, చిన్నచిన్న పనులు చేసుకునే వారి నుంచి పెద్దమొత్తంలో రాయల్టీలను వసూలు చేస్తోంది. ట్రాక్టర్ నడుపుకునే వారిని కూడా వదలకుండా ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తోంది. ఈ డబ్బులను ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించలేదు. ఈ సంస్థపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

ఓ.నల్లప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

అంతర్జాతీయ స్థాయికి అనంత అరటి

తాడిపత్రి నుంచి ముంబైకి బనానా ట్రైన్ - విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభం


అరటి పండ్ల రవాణా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి-తాడిపత్రి

అంతర్జాతీయ స్థాయికి అనంతపురం జిల్లా అరటి ఉత్పత్తులు చేరుతున్నాయి. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబైకి అరటి ఉత్పత్తులతో వెళ్లే బనానా రైల్‌ను ప్రారంభించారు. ముంబై నుంచి షిప్ ద్వారా ఇరాక్ దేశానికి అరటి ఉత్పత్తులు వెళ్లనున్నాయి. విజయవాడ నుంచి వర్చువల్‌గా పాల్గొని బనానా రైల్‌ను వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్, ఏపీ. గుంటూరు హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ప్రారంభించారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి బనానా రైల్‌ను అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, న్యూఢిల్లీ ఏపీఈడీఏ జనరల్ మేనేజర్ వినీత సుధన్షు, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్, సీనియర్ జనరల్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా పాల్గొన్న వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో తొమ్మిది రకాల పండ్లు పండిస్తున్నారని, వీటిని అంతర్జాతీయ స్థాయికి చేరుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంత జిల్లా అరటిని దేశంలోనే కాదు ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు ముందుచూపుతో జిల్లాలో లక్ష టన్నుల ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. అరటి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి ఎగుమతి చేయడం వల్ల 10-15 రూపాయల అధిక ధర రైతులకు వస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉద్యాన పంటలు దాదాపు 1,04,021 హెక్టార్లలో సాగవుతున్నాయని, 25.95 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ పండ్ల దిగుబడిని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ అగర్వాల్, ఆర్డీవో కేశవనాయుడు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గోరంట్ల

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాఖా గ్రంథాల యంలో వృద్ధులు, మానసిక వికలాంగులు 60 మందికి సిఐ శేఖర్ దుప్పట్లు పంపిణీ చేశారు. సిఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి పత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు దినపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రమేష్ నాయక్, జిఎం సురేష్, ఉపాధ్యాయుడు జగదీష్, శ్రీనివాస్ గుప్తా, చంద్ర, సోము, కృష్ణారెడ్డి, తదితరు లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-మడకశిర


ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీ ల్దార్ షెక్షావలి తెలిపారు. మండలంలోని హొట్టేబెట్ట గ్రామ సచివాలయంలో శుక్రవారం ప్రజా సమ స్యల పరిష్కార వేదిక(గ్రామసభ) నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ సమ స్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో అందిన అర్జీలను 3 నెలల్లోగా పరిష్కారించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పలు సమస్యలపై విన తులు సమర్పించారు. గ్రామసభలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప, పార్లమెంట్ కార్యదర్శి రవిభూషణ్, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్ ఆధ్వ ర్యంలో మండల యుటిఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వశించారు. ఈ సందర్భంగా మండల యుటిఎఫ్ నూతన శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా టి.రమేష్, అధ్యక్షులుగా సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కె.మారుతి, ఉపాధ్యక్షులుగా బి.నాగార్జునరెడ్డి, ముత్యాలప్ప, కోశాధికారి గా ఎం.నరేష్, సిపిఎస్ కమిటీ కన్వీనర్‌గా కె.శేషాద్రిను ఎన్నుకున్నారు. నరేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో-117ను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించి, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల పనివేళలను మార్పు చేయకుండా యధావిధిగా కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభను కాకినాడలో నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.


సానిపల్లి గంగాధర్


కె.మారుతి


ఎం.నరేష్

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్


ప్రయివేట్ స్కూల్ బస్సు ఢీకొని మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు అఖిల్(13) పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతుండే వాడు. ఉదయం పాఠశాలకు సైకిల్‌పై వెళ్తుండగా ఇస్లాపురం చెరువు కట్ట వద్ద ప్రయివేటు స్కూల్ బస్సును డ్రైవర్ రివర్స్ చేస్తూ సైకిల్‌పైకి దూసుకెళ్లడంతో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. విద్యార్థి మృతికి ప్రయివేట్ స్కూల్ యాజమాన్యం, విద్య, ఆర్టీవో శాఖల అధికారులు బాధ్యత వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు మహబూబ్‌బాషా, ఆటో నాగప్ప, రవి, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

దళిత కార్మికుడు మృతిపై ఫిర్యాదు

దళిత కార్మికుడు శివకుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ పరిగి మండలంలోని ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న దళిత కార్మికుడు శివ కుమార్(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. శివకుమార్ మృతిపై అతడి తండ్రి గోవిందప్ప సైతం అనుమానాలు ఉన్నాయని, కావున లేబర్ ఆఫీసర్ పరిశ్రమలో సీసీ ఫుటేజీలను పరిశీలించి సమగ్రంగా విచారించి బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, మండల సిఐటియు నాయకులు రాజురావు, మహబూబ్‌బాషా, ఆటో నాగప్ప, మూర్తి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు హైకోర్టు బెంచ్ మంజూరు హర్షణీయం

టిడిపి ప్రధాన కార్యదర్శి, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ



ప్రజాశక్తి-మడకశిర

కర్నూలుకు హైకోర్టు బెంచ్ మంజూరు చేయడం చారిత్రాత్మక విజయం అని టిడిపి ప్రధాన కార్యదర్శి, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల రాయలసీమ వాసులు, న్యాయవాదుల కల అయిన హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేసేందుకు శాసన సభలో తీర్మానం చేయడంపై సిఎం చంద్ర బాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎన్‌డిఎ ప్రభుత్వానికి గుండుమల ధన్యవాదాలు తెలిపారు. అలాగే మడకశిర పారిశ్రామికవాడకు అతి పెద్ద కేంద్ర ప్రభుత్వ పరిశ్రమను మంజూరు చేయించడం పట్ల సిఎం, డిప్యూటీ సిఎంతో పాటు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి నియోజకవర్గ న్యాయవాదుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆర్థిక కమిటీ సభ్యుల ఎన్నికల పోలింగ్‌లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే రాజు ఓటింగ్‌లో పాల్గొని మూడు కమిటీలకు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

'న్యాయం చేయండి సారూ'

రోడ్డు ప్రమాద మృతురాలి భర్త వేడుకోలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల పట్టణానికి చెందిన వేదవతి(49) గత సెప్టెంబర్ 23వ తేదీ గాంధీ సర్కిల్ సమీపంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదం జరిగిందని పోలీసులు భావించి కేసు నమోదు చేశారు. అలాగే మృతురాలి కుటుంబానికి రూ. 8 లక్షలు నష్టపరిహారం ఇప్పించేలా పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసి ఒప్పంద పత్రం రాసి ఇచ్చారు. అయితే స్టాంపులపై కూడా సంతకాలు పెడతామని నమ్మించి వెళ్లిపోయారు. ఆ తర్వాత వారి నుంచి స్పందన లేకపోవడంతో బాధిత కుటుంబం పరిహారం విషయమై పోలీసులను ఆశ్రయించగా దురు సుగా ప్రవర్తిస్తూ మీకు చేతనైంది చేసుకోమని పంపించేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఈ నెల 11వ తేదీ జిల్లా ఎస్పీ కార్యాలయంలో అర్జీ ఇచ్చారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం మృతురాలి భర్త మల్లికార్జున మీడియా సమావేశం నిర్వహించి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. 3 నెలలైనా తమకు న్యాయం చేయలేదని వాపోయాడు. గోరంట్ల పోలీస్ స్టేషన్‌లోని ఓ కానిస్టేబుల్ పంచాయితీ చేసి ప్రమాదానికి కారణమైన లారీ యజమాని శ్రీనివాసులుతో కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి సబ్‌స్టేషన్ పరిధిలోని చోళసముద్రం, బసవనపల్లి, నాయనపల్లి, కుర్లపల్లి, లేపాక్షి, నవోదయ పాఠశాల, కంచిసముద్రం, బింగిపల్లి ఫీడర్స్‌లోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కె.వి లేపాక్షి సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కార ణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.


మృతి చెందిన విద్యార్థి అఖిల్ (ఫైల్‌ఫోటో)

ప్రాణం తీసిన ప్రయివేటు బస్సు

8వ తరగతి విద్యార్థి మృతి
తల్లిడిల్లిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పెనుకొండ

ఉదయాన్నే అమ్మానాన్నలకు టాటా చెప్పి పాఠశాలకు బయల్దేరాడు. పుస్తకాలను భుజానికి వేసుకుని చదువుల బడికి ఆనందంగా వెళ్తున్నాడు. ఇంతలో అనుకోని ఘటనతో ఆ విద్యార్థి మృత్యుఒడికి చేరాడు. ప్రయివేటు బస్సు వెనక్కు తిప్పికునే క్రమంలో విద్యార్థినిని గమనించకుండా పోనీయడంతో చక్రం కింద పడి ఘటనా స్థలంలోనే మరణించాడు. పాఠశాలకు వెళ్తాన్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు అనుకోని ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు గుండెలవసేలా రోధించారు. పెనుకొండ మండలం ఇస్లాపురం వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాధాన్ని నింపింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

పెనుకొండ మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన నాగరాజు, రాధమ్మల కుమారుడు అఖిల్(13) పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు తన సైకిల్లో బయలుదేరాడు. ఇస్లాపురం చెరువు కట్ట వద్దకు రాగానే పెనుకొండ పట్టణం ఘణగిరి పాఠశాలకు చెందిన స్కూలు బస్సు రివర్స్ చేసుకుంటోంది. బస్సు వెనక ఉన్న విద్యార్థినిని గమనించని స్కూల్ బస్సు డ్రైవర్ వేగంగా వెనక్కు బస్సును నడిపాడు. సైకిల్ పై ఉన్న నిఖిల్ పట్టుతప్పి కింద పడ్డాడు. బస్సు వెనుక చక్రాలు ఈ విద్యార్థిపై వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. కుమారుని మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా అక్కులప్ప

ప్రజాశక్తి - గాండ్లపెంట

సిఐటియు మండల కన్వీనర్‌గా అక్కులప్పను ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సిఐటియు ప్రజా సంఘాల సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సిఐటియు నాయకుడు సాంబశివ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల కమిటీ ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సిఐటియు మండల కన్వీనర్‌గా అక్కులప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సివిల్ సప్లై కొండయ్య, ఎర్రదొడ్డి స్వచ్ఛభారత్ నరసింహులు, అంగన్వాడీ లక్ష్మీదేవి, సుజాత, శకుంతల, ఆశ వర్కర్లు లక్ష్మీదేవిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన

ప్రజాశక్తి - ఓబులదేవర చెరువు

మండల పరిధిలోని బాబా సాహెబ్ పల్లిలో ఎంపీపీ పాఠశాలలో ఎంఎల్‌హెచ్‌పి అరుణ జ్యోతి ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు కేశవ, ఆశా కార్యకర్త తార, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు

ధర్మవరం ఆసుపత్రి అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 50 లక్షల నిధులను కేటాయించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతీ గ్రామ పంచాయతీలలో ఆరోగ్య కేంద్రాన్ని, పట్టణంలోని ఆసుపత్రిని అభివృద్ధి చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- పరిగి

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా పరిగి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులచే మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపలువురు అధికారులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- బుక్కపట్నం

మండల కేంద్రంలో బైపాస్ రోడ్, మెయిన్ రోడ్‌లో టిడిపి పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, వెంకట రాముడు, మంజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ వేరుశనగ

ప్రజాశక్తి - నల్లచెరువు

రబీ సీజన్లో బోరుబావుల కింద వేరుశనగ పంట సాగు చేసే రైతులను సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కే6 రకం వేరుశనగ రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. వేరుశనగ కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్ ఫోను తీసుకొని రావాలన్నారు. సబ్సిడీ పోనూ వేరుశనగ 30 కేజీల బస్తా 1728 రూపాయలు చెల్లించాలన్నారు. ప్రతి రైతుకు గరిష్టంగా మూడు బస్తాల వరకు ఇస్తామన్నారు.

కొటిపిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కొటిపిలో శుక్రవారం వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు వందమంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో కుశాల్ హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్థానిక సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసంపై వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, సిడబ్ల్యూఐ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో పాటు కేజీబీవీ ప్రిన్సిపల్స్, జూనియర్ కళాశాలల అధ్యాపకులకు, సచివాలయ మహిళా పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విలువలు నేర్చుకోవాలన్నారు. అప్పుడే వారు చదువు యొక్క ప్రాముఖ్యతను గుర్తించిఉన్నత స్థాయికి చేరడానికి ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సుధావరలక్ష్మి, డిఆర్‌డిఎ నరసయ్య, డిపిఒ సమత, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో వార్డులో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గం ప్రజల ఆరోగ్యం పై స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని జిల్లాస్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. దీనికి తోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఆరోగ్య రథం ద్వారా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 9 వ వార్డులో ఎన్టీఆర్ ఉచిత ఆరోగ్య రథం ద్వారా వైద్య సేవలను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు, కౌన్సిలర్ డిఇ.రమేష్ కుమార్, 9 వ వార్డ్ కౌన్సిలర్ దుర్గా మంజుళ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రెస్ వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షులు దుర్గా నవీన్, నాయకులు ప్రసాద్, సునీల్ కుమార్, శివ, గోవింద్, దివాకర్, అబ్దుల్ అలీం, వెంకటేష్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



వినతి అందజేస్తున్న నాయకులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ ఛైర్పర్సన్ కాచర్ల లక్ష్మీ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో 25సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి. రమణ, ఆదినారాయణ, ఇంజినీరింగ్ సెక్షన్ యూనియన్ అధ్యక్షులు బొగ్గ నాగరాజు, ఉపాధ్యక్షులు అంజి పెద్దన్న, బాబు, అనీల్, కాటమయ్యతో పాటు కార్మికులు రాంప్రసాద్, చింతా కేశవ,దస్తగిరి,చంద్ర మోహన్ గౌడ్, జంగం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ముదిగుబ్బ



ధర్నాలో నాయకులు, కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ముదిగుబ్బ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా రెండో రోజైన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ ముదిగుబ్బ మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముస్తఫా, రఫీ, నౌషాద్, పంచాయతీ కార్మికులు ఆదినారాయణ, ఓబులేసు, సావిత్రి, హరి తదితరులు పాల్గొన్నారు.

బకాయి ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్‌ను కోరిన పట్టు రైతులు



కమిషనర్‌కు వినతిని ఇస్తున్న పట్టు రైతు సంఘం, రీలర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రవ్యాప్తంగా పట్టు రైతులకు, రీలర్లకు విడుదల చేయాల్సిన ప్రోత్సాహక నిధులను వెంటనే విడుదల చేయాలని పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీనివాసులును పట్టు రైతులు, రీలర్లు కోరారు. శుక్రవారం గుంటూరులో పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీనివాసపులును కలిసిన వారు పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిని అందించారు. ఈ సందర్భంగా పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం వెంకట్రామి రెడ్డి, జిల్లా నాయకులు సిద్దారెడ్డి మాట్లాడుతూ 2010-19 మధ్యకాలంలో పట్టు రైతులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందన్నారు. 2019 అనంతరం ఏర్పడిన ప్రభుత్వం పట్టు రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే వైఎస్ఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పట్టు రైతులు మల్బరీ సాగు చేయడం వదిలేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన పట్టు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక బకాయిలు రూ. 54 కోట్లు విడుదల చేసి, ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. పట్టు పరిశ్రమ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, పదవీ విరమణ పొందిన స్థానాల్లో నూతనంగా నియమకాలు చేపట్టలేదని, ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేసి సాంకేతిక సలహాలను ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని కోరారు. సమస్యలను విన్న పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించి పట్టు పరిశ్రమకు పట్టు రైతులు, రీలర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ హామీ ఇచ్చినట్లు పట్టు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టు రైతు సంఘం నాయకులు పరిగి నవీన్, సోమశేఖర్, హనుమంతరాయప్ప, ధర్మవరం ఆదినారాయణప్ప, ఎనుములదొడ్డి మల్లి, పలమనేరు శంకర్ తో పాటు రైతులు, డీలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 25 తేదీన పుట్టపర్తి కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు జెవి. రమణ టి.అయుబ్ ఖాన్ మాట్లాడారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఈ కార్యక్రమంలో స్కూల్స్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, ఐ.లక్ష్మీదేవి. కె నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి దాడులను అరికట్టండి

ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలో పలువురు టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడులకు దిగుతున్నారని వాటికి అడ్డుకట్ట వేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైసిపి నాయకులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలంలో ఇలాంటి దాడులు అత్యధికంగా నమోదయ్యాయని వాపోయారు. మహిళలని కూడా చూడకుండా వారిపై దాడులు నిర్వహిస్తున్నారన్నారు. వీటికి తోడు నల్లమాడ, ఓడిసి మండలాల్లో రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. స్పందించిన ఎస్పీ విచారణ చేపట్టి అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల పేరుతో దోపిడీ

మీ సేవా కేంద్రాల నిర్వాకం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

జనన ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు చేర్పుల పేరుతో మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలు భారీగా పేదల వద్ద డబ్బులు దండుకుంటున్నాయని టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాల్లో ఇంటిపేరు, పేరు తప్పులు, ఇతర సవరణల కోసం పేదలు మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారన్నారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకున్న మీ సేవ కేంద్రం నిర్వాహకులు వెయ్యి రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యను తహశీల్దార్ నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చినగాని నరసింహ యాదవ్, వెంకటనారాయణ, చిన్నగాని కిష్టయ్య, ఆనంద్, రామచంద్ర, శ్రీనివాసులు, వెంకటకృష్ణ, కొలసాని చంద్ర, గోపీనాథ్, స్టూడియో అశోక్, కుల్లాయప్ప, ఇమాము తదితరులు పాల్గొన్నారు.

మీసేవా ఆపరేటర్లకు తహశీల్దార్ హెచ్చరికలు

మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాల ఆపరేటర్లకు తహశీల్దార్ నారాయణస్వామి హెచ్చరించారు. నిర్వాహకులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుతో తహశీల్దార్ స్పందించారు. ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం కాకుండా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బర్త్ సర్టిఫికెట్లకు లాయర్ నోటరీ అవసరం లేదని ఫ్యామిలీ సర్టిఫికెట్ కు మాత్రమే లాయర్ నోటరీ అవసరమని తహశీల్దార్ చెప్పారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి

ఎమ్మెల్యే పల్లె సింధూర



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పని దినాలను 100 రోజుల నుండి 150 రోజులకు పెంచాలని, ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సత్యసాయి జిల్లాలో దాదాపు పది మండలాలను కరువు మండలాలుగా గుర్తించారని అదేవిధంగా అనంతపురం జిల్లాలో ఏడు మండలాలు రాష్ట్ర వ్యాప్తంగా 54 మండలాలు కరువు పీడిత మండలాలను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఆ మండలాల్లోని కూలీలకు ఉపాధి లభించక ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గుర్తు చేశారు. కాబట్టి ప్రభుత్వం ఆ మండలాలను ప్రత్యేకంగా పరిగణించి వారికి అధిక పని దినాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతే కాకుండా వ్యవసాయంపై ఆధారపడిన ఈ ప్రాంత రైతులు పంటల పెట్టుబడి భరించలేక అప్పుల బారిన పడి ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి ఉందన్నారు. చాలా మంది రైతులు పంటల సాగులో ఆర్థిక వ్యయంతో పంట పండించేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే అటు రైతులకు ఇటు కూలీలకు ఎంతో ఉపయోగ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కూలీలకు ఎంతో తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి చెప్పిన అంశాలను తప్పకుండా పరిగణలోకి తీసుకొని వాటి అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు ఉపాధి పనులు చేపట్టే ప్రాంతంలో కావాల్సిన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

లైంగిక దాడి నిందితులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

విశాఖపట్నం ప్రాంతంలో విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉండే అన్ని మండలాల్లో కేజీబీవీల్లో, బాలికల హాస్టళ్లలో వాచ్‌మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు కనుమ దామోదర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పరిగి : మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ పరిశ్రమలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కార్మికుడు శివకుమార్ కుటుంబానికి దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు అండగా నిలిచారు. ఈ మేరకు ఆయన హిందూపురంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి దహన సంస్కారాల కోసం రూ.5వేలను అందజేశారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్మికుడి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడిగినహళ్లి ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విఆర్ఎల జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



సమావేశంలో పాల్గొన్న విఆర్ఎలు, నాయకులు

శ్రీ సత్య సాయి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జానీబాష, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర లింగుట్ల, వి.ఓబులేసు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.శ్రీ సత్య సాయి జిల్లా నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా గంగాధర్ , జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్ , జిల్లా సహ అధ్యక్షులుగా కాంత రాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం , ఆంజనేయులు, మారుతి ప్రసాద్, కేశవ ప్రసాద్, నరసింహులు, కోశాధికారిగా సుదర్శన్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీగా అశ్విని రెడ్డెప్ప మణిపద్మ, రమణ, చంద్ర శేఖర్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా మల్లిఖార్జునరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, చిన్ననాగప్ప, అంజినేయులు, ప్రభావతి పోతులయ్య, బాబు పాపయ్యను ఎన్నుకున్నారు.

మంత్రివర్గ నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి-హిందూపురం

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం నిర్ణయించడం హర్షనీయమని న్యాయవాదుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక న్యాయస్థానం ముందు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తన పాదయాత్ర సందర్భంగా కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగానే మంత్రివర్గం నిర్ణయించి అసెంబ్లీలో ఆమోదించారన్నారు. దీనికి తోడు లోకాయుక్త మానవ హక్కుల న్యాయస్థానాలను కర్నూలు నుండి తరలించేది లేదని ముఖ్యమంత్రి ప్రకటించడం ఈ ప్రాంత న్యాయవాదులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టిడిపి న్యాయవిభాగ పార్లమెంటు అధ్యక్షులు శివశంకర్, సుదర్శన్, సిద్దు, నాగేంద్ర, రకీబ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన భార్యభర్తలు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గ్రామానికి చెందిన గంగన్న, నరసమ్మ అనే దంపతులు నాగిరెడ్డిపల్లి క్రాస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పట్నం ఎస్ఐ రాజశేఖర్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

స్థల వివాదంలో పలువురిపై కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణం మదనపల్లి రోడ్డు పర్వీనుభాను పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న స్థలానికి సంబంధించిన వివాదంలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. కోర్టు ద్వారా అనుమతులు పొందిన తరువాత కూడా తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణానికి చెందిన మహిళ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన చంద్రకళ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపానికి గురైన చంద్రకళ శుక్రవారం తన ఇంటిలో సూపర్‌వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి చంద్రకళను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

దుర్గానగర్‌లో వ్యక్తి ...

ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలనీకి చెందిన మల్లికార్జున(45) అప్పుల బాధ తాళలేక మనస్థాపానికి గురైన తన ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి మల్లికార్జునను ఆసుపత్రికి తరలించారు.

ఇసుక అక్రమ తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇసుక అక్రమ తరిలింపుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కొట్లపల్లి, నిడిమామిడి ,పరిసర ప్రాంతాల్లో వంగ పేరు నది నుండి యథేచ్ఛగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు శుక్రవారం అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. వంగ పేరు నది నుండి ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారని దానివలన నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న బోర్లు బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని కోట్లపల్లికి చెందిన ఆదినారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాబు సాబ్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వాపోయారు. ఈ మేరకు వారు తహశీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన తహశీల్దార్ రెవెన్యూ అధికారులను గ్రామానికి పంపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మల్బరీషెడ్డులో షార్ట్ సర్క్యూట్.. రూ. 20 లక్షల నష్టం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని తాళికెర గ్రామానికి చెందిన చిత్తప్ప కుమారుడు రైతు సురేంద్రకు చెందిన మల్బరీ షెడ్డులో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో షెడ్డులో ఉన్న సామగ్రి మొత్తం కాలి బూడిదైందని సురేంద్ర శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించాడు. మల్బరీ షెడ్‌లో ఉంచిన పత్తి, స్ప్రేయర్, షెడ్డు పైకప్పు, తదితర వస్తువులు పూర్తిగా కాలి బూడిద కావడంతో రూ. 20 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

గోశాలకు ఆవులు తరలింపు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని వారపు సంత వద్ద చెన్నైకు చెందిన అనిమల్ బోర్డు సంస్థ, గోసంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న 29 గోవులను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ మక్బూల్‌బాషా తెలిపారు. గోవులను తరలిస్తున్న 407 వాహనాన్ని సైతం సీజ్ చేసినట్లు చెప్పారు. గోవులను అన్నమయ్య జిల్లా తంబాలపల్లి గ్రామం సమీపంలో గల నవశక్తి పీఠం గోశాలకు తరలించినట్లు వివరించారు.

గుండెపోటుతో ప్రయివేటు స్కూల్ కరస్పాండెంట్ మృతి

ప్రజాశక్తి- ముదిగుబ్బ

మండల కేంద్రంలోని మాస్టర్స్ స్కూల్ కరస్పాండెంట్ నాగరాజు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం తెల్లవారుజామున నాగరాజుకు ఛాతిలో నొప్పి రావడంతో అసుపత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళను చేరదీసిన సిఐ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో మతిస్థిమితం లేని మహిళను పుట్టపర్తి అర్బన్ సిఐ సునీత చేరదీశారు. ఆమెకు స్నానం చేయించి నూతన వస్త్రాలను అందజేశారు. ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మహిళకు సపర్యలు చేయడంలో పోలీసులకు సహకారం అందించారు. మతిస్థిమితం లేని ఓ మహిళ ఆకలితో అలమటిస్తూ తిరుగుతుండగా విషయం తెలుసుకున్న సిఐ సునీత పోలీసులను పురమాయించి మహిళకు స్నానాలు చేయించి నూతన వస్త్రాలు అందించి ఆమె ఆకలి తీర్చి వృద్ధాశ్రమంలో వదిలిపెట్టారు. ఈసందర్భంగా ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సీఐ సునీత సహకారంతో మహిళను క్షేమంగా వృద్ధాశ్రమంలో విడిచిపెట్టామని తెలిపారు.

గ్రాప్లింగ్ లో 'పురం' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 18 నుంచి 20 వరకు ఉత్తరా ఖండ్‌లోని హరిద్వార్‌లో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు హిందూపురం పట్టణంలోని గ్రాప్లింగ్ ఇన్‌స్ట్రక్టర్ చరణ్ రాజ్ వద్ద శిక్షణ తీసుకున్న ఎమ్‌సి హితేష్ దత్త, శ్రీ చరణ్, అర్షద్ పాల్గొన్నారు. ఈపోటీల్లో ఎమ్.సి. హితేష్ దత్త తృతీయ స్థానంలో నిలిచినట్లు కోచ్‌లు ఆర్‌కె రమేష్, చరణ్ రాజు, రెఫరీ ఉసామా ఖాన్ తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో పట్టణ ప్రముఖులు, గ్రాప్లింగ్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎస్సీ వర్గీకరణ కు అనుకూలంగా ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం పట్ల ఎంఇఎఫ్ నాయకుల నాగేంద్ర హర్ష వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కదిరి పట్టణం అంబేద్కర్ సర్కిల్ నందు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిషన్ ఏర్పాటు ద్వారా ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిశీలించి, సరైన పరిష్కారాలను ప్రభుత్వం ముందుకు తీసుకురావడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ ఆనంద్, శ్రీనివాసులు, ఆదినారాయణ, నాగప్ప, నాగభూషణం పాల్గొన్నారు.

బిసిలు చైతన్యంతో హక్కులను పొందాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

బిసిలు చైతన్యంతో తమ హక్కులను సాధించుకోవాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికారప్రతినిధి, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు కోరారు. శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయనతో పాటు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఎ.సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి యాటగిరి రామచంద్రప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నామాల శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భగా అంపావతిని గోవిందు మాట్లాడుతూ బీసీలు 78ఏళ్లుగా కోల్పోతున్న వాటాను సాధించుకోవడానికి 'సమగ్ర కులాల వారిగా' జనగణన చేయాల్సుందన్నారు. అందుకోసం బీసీలు వీధి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 78ఏళ్లుగా జనాభా లెక్కలు లేకపోవడం వలన అన్ని రంగాల్లో బిసిలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో బీసీలను అడుగడుగునా టిడిపి, వైసిపిలు తొక్కివేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్, బోయ రవిచంద్ర, ఎ.నరసింహులు, రోషన్ జమీర్, పోలా లక్ష్మీనారాయణ, పి. రామచంద్ర, ఎం.సూరి, కె.కల్యాణి, ఎ. లక్ష్మీనారాయణ, సి.వీరనాగప్ప, డి.శ్రీరాములు, డి.నాగలయ్య, ఎం.జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట భద్రత : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయిబాబా 99 వ జయంతి వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నా తరుణంలో జిల్లా ఎస్పీ వి. రత్న ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గవర్నర్ పర్యటన నిమిత్త సత్యసాయి జిల్లాతో పాటు అనంతపురం, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుండి బందోబస్తుకు హాజరైన డీఎస్పీ , సిఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందికి కు బందోబస్తు పై ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. పోలీసులు అప్రమత్తంగా ఉండి , పకడ్బందీ భద్రతో విధులు నిర్వహించాలన్నారు. గవర్నర్ బెంగుళూరు నుండి పుట్టపర్తికి రోడ్డు మార్గం ద్వారా రానున్నడటంతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . ప్రధానంగా ట్రాఫిక్ పై దృష్టి పెట్టి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను క్రమబద్ధీకరణ వరసలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పుట్టపర్తి టౌన్ లోని ప్రధాన ప్రాంతాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బాంబ్ స్క్వాడ్ బృందాలు, సెక్టర్ ఇంచార్జ్ అధికారులు , రూట్ బందోబస్తు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. దేశ విదేశాల నుండి ఎంతోమంది భక్తులు పాల్గొంటున్న సందర్భంగా చైన్ స్నాచింగ్, పిట్ ప్యాకెట్స్ జరగకుండా ప్రత్యేక పోలీస్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్ సిబ్బంది సత్య సాయి సేవాదళ్ సభ్యులు తో కలిసి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వేడుకలు ముగిసిన అనంతరం గవర్నర్ వెళ్లే వరకు పోలీస్ అధికారులకు తమకు కేటాయించిన పాయింట్లలో పూర్తి బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్ , సిఐలు, ఎస్ఐలు, డీఎస్పీలు పోలీసులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రత ఏర్పాట్లు :బాబా జయంతి వేడుకలతో పాటు గవర్నర్ పర్యటన సందర్భంగా ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సిఐలు, 48 మంది ఎస్ఐలు, 171 మంది ఎఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 300 మంది పోలీసులు, 26 మంది మహిళా పోలీసులు, 170 మంది హోంగార్డులతో పాటు స్పెషల్ పార్టీ, ఎఆర్ బలగాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనివ్వొద్దు

పుట్టపర్తి క్రైమ్ :సత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకలు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా విజయవాడ నుంచి ఎమ్మెల్యే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడారు. సత్య సాయి బాబా జన్మదిన వేడుకలకు లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తారని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లను చేయాలని పట్టణ మున్సిపల్, రెవిన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ అధికారులతో కలిసి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. పుట్టపర్తి పట్టణంలోని సత్తెమ్మ గుడి వద్ద తాగునీరు, చిత్రావతి రోడ్డు లోని కర్నాటక నాగేపల్లి వద్ద వాహనాల పార్కింగ్ మెడికల్ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. చిత్రావతి నది ఒడ్డున చెత్త చెదారం లేకుండా చూడాలని సూచించారు. సాయినగర్ ప్రాంతంలో ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎలాంటి ప్రవేట్ వాహనాలు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. కర్నాటక నాగేపల్లి వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న డ్రైవర్ వెంకటరాముడు కుమారుడు హరిని ఈసందర్భంగా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రత్నతో కలసి బాబాజన్మదిన వేడుకల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం ను ఎస్పీతోపాటు మాజీమంత్రి, పోలీస్ అధికారులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నరసింహ మూర్తి,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్లు గంగన్న, బెస్త చలపతి, సామకోటి ఆదినారాయణ, టీడీపీ యూత్ లీడర్ పట్టణ 7 వ కౌన్సిలర్ లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, అంబులెన్స్ రమేష్, ముద్దుపాటీ రవి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

పక్కాగా ఎంఎస్ఎంఇ సర్వే : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎంఎస్ఎంఇ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల స్థాపన) సంబంధించిన సర్వే పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమ శాఖ అధికారులతో సర్వే పనితీరు, నిర్వహణ, టర్నోవర్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వాణిజ్య, వ్యాపార, సేవా రంగ సంస్థలు, ఉత్పత్తి దారులకు ఎంఎస్ఎంఇ సర్వేపై పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. సర్వే ప్రక్రియలో ఆయా పరిశ్రమకు సంబంధించిన ఉపాధి కల్పన, టర్నోవర్, ప్రస్తుతం అందుతున్న బ్యాంకుల రుణాల సదుపాయాలు, రాయితీలు తదితర వివరాలను సర్వే యాప్ ద్వారా పొందు పరిచాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ సర్వే వల్ల మన ఆర్థిక ప్రగతిని అసంఘటిత రంగం నుండి సంఘటిత రంగానికి తీసుకొని రావడంతో పాటు ప్రభుత్వం ద్వారా యువతకు ఉపాధి ప్రోత్సాహక అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యాపార సేవా రంగ ఉత్పత్తి దారులు అందరు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నమోదు ను తప్పకుండా చేసుకోవాలని ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందనితెలిపారు. వాణిజ్య పనుల శాఖ ఆధ్వర్యంలో వ్యాపార, సేవా రంగసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలకు ఎంఎస్ఎంఇ పై అవగాహన కల్పించి సర్వేకు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, హిందూపురం విభాగం వాణిజ్య శాఖ అధికారి కృష్ణవేణి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ, ఐపిఒలు సంజీవరాజు, దుర్గేష్, ఓబులేసుతో పాటు పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు రాష్ట్రంలో పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడానికి ప్రభుత్వం పట్టిష్టమైన రక్షణ చట్టాలను అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నాగవేణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మామిళ్లికుంట క్రాస్ వద్ద వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై, విద్యార్థినులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం రక్షణ కల్పిస్తామని చెబుతోందని కాని ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదన్నారు. యువత డ్రగ్స్, మద్యం, ఇతర చెడు అలవాట్లకు గురై మహిళలపై అత్యాచారాలకు దాడులకు పాల్పడుతున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విశాఖలో లా విద్యార్థినిపై అత్యాచారం చేసి ఆమెను చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముత్యాలు, పార్టీ నాయకులు శ్రావణి, నాగవేణి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి- కొత్తచెరువు

మండల వ్యాప్తంగా ఈనెల 23, 24వ తేదీల్లో 38 పోలింగ్ కేంద్రాల్లో బిఎల్వోలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారని ఈ క్యాంపుల్లో అర్హులైన వారి ఓటరుజాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంకాలం 5 గంటల వరకు ఆయా కేంద్రాల వద్ద వారు అందుబాటులో ఉంటారన్నారు, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు చేర్పులు మార్పులు, తప్పొప్పులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆటోలో ఎక్కించుకునే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు.శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లి నుండి తాడిమర్రి, నార్పల,అనంతపురం ముదిగుబ్బ, ధర్మవరం తదితర మండలాలకు వివిధ మార్గాలలో ఆటోలు నడిపే డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయా మండలాలకు ఆటోలు నడిపే డ్రైవర్లతో సమావేశమైన ఎస్ఐ రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులను కెపాసిటీకి మించి ఆటోలలో ఎక్కించుకొని ప్రయాణించరాదన్నారు. ముఖ్యంగా ఆటోలలో లౌడ్ స్పీకర్లు ఉపయోగించ రాదని, సెల్‌ఫోన్లో మాట్లాడకుండా వాహనాలను నడపాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు లైసెన్సులను డ్రైవర్లు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా క్రమ పద్ధతిలో వాహనాలు నిలపకపోయినా భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.